ప్రభాత
కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
బుధవారం 04 మార్చి 2026

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

చిన్నమండెం మార్చి 03 ప్రభాతవార్త:



మండలంలోని బోరెడ్డిగారిపల్లిలో తన స్వగృహం నందు జిల్లా నలుమూలల నుండి వచ్చిన అధికారులు ప్రజలతో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు, అభ్యర్థనలు, వినతులు స్వయంగా విని తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండి, సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం తమ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కలిసి తమ సమస్యలను వివరించగా, వాటిని పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా కొంతమంది అధికారులు ప్రజలు దుశ్యాలువ పుష్పగుచ్చములతో మంత్రిని సత్కరించినారు.

## వైభవంగా కదిరిపౌర్ణమి వేడుకలు

మదనపల్లె, మార్చి 3 ప్రభాతవార్త :



పట్టణ సమీపంలోని అనపగుట్ట శ్రీవారినగర్‌లో వెలసియున్న శ్రీ అభయలక్ష్మినరసింహాస్వామి ఆలయంలో మంగళవారం కదిరి పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ నిర్వాహకులు, ప్రధాన అర్చకులు రమేష్‌స్వామి ఆధ్వర్యంలో పూజలు ఘనంగా జరిగాయి. అదే విధంగా శ్రీ లక్ష్మి అమ్మవారు జయంతి సందర్భంగా కూడా పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి, అమ్మవారికి విశేష పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

### ఒంటిమిట్టలో రూ.20.17 కోట్లతో

# 108 అడుగుల జాంబవంతుని విగ్రహం

**కడప రేణిగుంట జాతీయ రహదారి పక్కనే**

**...ఒంటిమిట్ట చెరువులో ఏర్పాటుకు టిటిడి ఆమోదం**

**ప్రపంచంలోనే జాంబవంతుని అతిపెద్ద విగ్రహం ఇదేనేమో?**

**ఏప్రిల్ 1న సీఎం శంకుస్థాపన చేసే అవకాశం**


రాజంపేట, మార్చి 3 ప్రభాతవార్త :

హనుమంతుడు లేని రామాలయం ఎక్కడైనా చూశారా? దేశంలోని అయోధ్య తర్వాత అతి ప్రాచీన ఒంటిమిట్ట కోదండ రామాలయంలో హనుమంతుడు కనిపించరు. ఒకే శిలపై సీతారామ లక్ష్మణులను త్రేతాయుగంలో జాంబవంతుడు ప్రతిష్టించారని పురాణ చారిత్రక నేపథ్యం. అందుకే రాష్ట్రంలో ప్రభుత్వం అధికారికంగా శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహించే ఒంటిమిట్టలో దేశంలోనే ఎక్కడా లేనివిధంగా 108 అడుగుల జాంబవంతుని విగ్రహం ఏర్పాటుకు తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి ఆమోదముద్ర వేసింది. కడప రేణిగుంట జాతీయ రహదారి (ఎన్ హెచ్ 716) పక్కనే ఉన్న కోదండ రామాలయానికి ఉన్న చారిత్రక నేపథ్యాన్ని ప్రపంచానికి చాటేందుకు ఒంటిమిట్ట చెరువులోనే ఒక ఐలాండ్ (ద్వీపాన్ని) ఏర్పాటు చేసి మధ్యలో జాంబవంతుని విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు 20.17 కోట్ల రూపాయల నిధులు కేటాయించారు .సీఎం ఆదేశాల మేరకు జాంబవంతుని విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బి ఆర్ నాయుడు వెల్లడించారు. ఏప్రిల్ 1న ఒంటిమిట్టలో జరిగే సీతారాముల కల్యాణోత్సవానికి సీఎం రానున్నారు. ఈ సందర్భంగా జాంబవంతుని విగ్రహ ప్రతిష్టాపన పనులకు శంకుస్థాపన చేసే అవకాశాలు లేకపోలేదు.ఇప్పటికే టీటీడీ అధికారులు విగ్రహం ఏర్పాటుకు సంబంధించి అంచనాలు రూపొందించి నివేదికలు సిద్ధం చేశారు. అంతే కాకుండా విగ్రహం ఏర్పాటుకు జల వనరుల శాఖ నివేదిక సిద్ధం చేసి టిటిడి కి అందజేసింది .జాతీయ రహదారి పక్కనే ఉన్న రామతీర్థం ఎదురుగా ఒంటిమిట్ట చెరువులో చుట్టూ నీరు మధ్యలో 108 అడుగుల విగ్రహం ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. అందుకు జాతీయ రహదారి నుంచి చెరువులోకి250 మీటర్ల పొడవున ఏడు మీటర్ల వెడల్పుతో రహదారిని నిర్మిస్తారు. జాంబవంతుని విగ్రహం ఏర్పాటు చేసే ఐలాండ్ కు తూర్పున జాతీయ రహదారి, పడమటి వైపున ఉన్న సీతారాముల కళ్యాణం వేదికకు కూడా రహదారిని అనుసంధానం చేస్తారు. ఇక్కడ నుంచి ఒంటిమిట్ట రైల్వే స్టేషన్ కు కూడా రహదారిని కలుపుతారు. జాంబవంతుని



ఒంటిమిట్ట చెరువులో ఏర్పాటు చేయనున్న 108 అడుగుల జాంబవంతుని విగ్రహం ఆకృతి

విగ్రహం వద్దకు వెళ్లాలంటే జాతీయ రహదారి వద్దకు చేరాలి. ఇక్కడే మరో చారిత్రక ఇతిహాసం ఉంది. త్రేతాయుగంలో దండకారణ్యంలో సీతా రాముడు వెళుతుండగా సీతమ్మకు దాహం వేస్తుంది. దీంతో శ్రీరామచంద్రుడు సీతమ్మ దప్పిక తీర్చేందుకు రామబాణాన్ని సంధిస్తారు. రామబాణం పడినచోట జలం ఉప్పొంగుతుంది. అందుకే ఈ చోటుకు రామతీర్థం అని పేరు వచ్చింది. ఒంటిమిట్ట కోదండ రామాలయాన్ని టీటీడీలో విలీనం చేసే నాటికి రామతీర్థం శిలావస్థకు చేరుకునింది. టిటిడి రామ తీర్థానికి ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి చేసి ఎవరూ వెళ్లకుండా రక్షణ ఏర్పాటు చేసింది.అందుకే రామతీర్థం వద్ద నుంచి జాతీయ రహదారి మీదుగా జాంబవంతుని విగ్రహం వద్దకు రహదారిని నిర్మించాలని ఇంజనీరింగ్ అధికారులు అంచనాలు రూపొందించారు. ఇలాంటి చారిత్రక నేపద్యాలన్నింటినీ పర్యాటకులకు తెలిసేందుకు 20. 17 కోట్లతో ఒంటిమిట్ట చెరువులో జాంబవంతుని విగ్రహం ఏర్పాటు చేయాలని టిటిడి నిర్ణయించింది.



ప్రముఖ పుణ్యక్షేత్రం అత్తిరాల త్రేతేశ్వర స్వామి ఆలయం పక్కనే చంద్రబింబం

## మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు..



కడప కార్పొరేషన్ మార్చి 3 ప్రభాతవార్త:

ఎపి ఎన్ జి జిఓస్ జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి పి.నిత్యపుజయ్య, జిల్లా మహిళా విభాగం చైర్ పర్సన్ బి.కృష్ణకుమారి, కన్వీనర్ ఎన్.ఎం.సినీత ఆధ్వర్యములో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించు కొని మహిళలకు కిరాక్ పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ఆటల పోటీలు కడప మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 5, 6 తేదీల్లో రెండురోజులు సా. 4 గం.ల నుంచి నిర్వహిస్తామని చెప్పారు. కడప జిల్లాలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులందరూ ఆటల పోటీలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆటల పోటిలలో విజేతలకు 8 తేదీన సా. 5గం.లకు ఎపి ఎన్ జి జిఓస్ హోము నందు బహుమతులు ప్రధానం చేస్తామన్నారు. ఆటల పోటీలలో పాల్గొదలచినవారు పేర్ల వివరాలు ఇవ్వాలని మనవి చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మెన్, ఏ కే. పద్మజ, వి. జ్యోతి మణి, టీ. సుమలత, జేఏసీ కోశాధికారి టీ. శ్రీనివాసులు పాల్గొన్నారు.

## అంతరాష్ట్ర దొంగ అరెస్ట్

**పంతం చెరువు క్రాస్ వద్ద వాహనాలు తనిఖీలు**



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పి

పీలేరు మార్చి 03 ప్రభాతవార్త:

జిల్లా పరిధిలో నే కాకుండా పక్క జిల్లాలైన తిరుపతి చిత్తూరు కడప అనంతపురం తదితర జిల్లాలలో ద్విచక్ర వాహనాలు చోరికే గురవుతున్న విషయం పసిగట్టిన పీలేరు సర్కిల్ ఇన్స్పెక్టర్ యుగంధర్ ఉన్నత అధికారుల ఆదేశంతో టీం గా ఏర్పడి దొంగల కోసం వేట మొదలుపెట్టడం ఆ వేటలో రాయచోటి పట్టణానికి షేక్ అరీఫ్ అని గుర్తించి ఇందిరమ్మ కాలనీకి చెందిన గజదొంగ ద్విచక్ర వాహనాలు దొంగలిస్తున్న విషయాన్ని గ్రహించారు కథ కొద్దిరోజులుగా అతని నడవడికల మీద అనుమానం రావడంతో పోలీసు నిఘా పెట్టడం జరిగింది గత నెల రోజులుగా అతనిపై నిఘా ఉంచడంతో మంగళవారం పొంతలచెరువు క్రాస్ సమీపంలో యధావిధిగా వాహనాల తనిఖీలు భాగంగా ప్రతి ఒక్క వాహనాన్ని తనిఖీ చేస్తుండటంతో అనుమానం వచ్చిన ఒక వ్యక్తిని విచారించగా సమాధానం పొంతన లేకపోవడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ తెలిపారు అతనిని విచారించడంతో పలు జిల్లాలలో ద్విచక్ర వాహనాలు దొంగలించినట్లు నేరమంగీకరించడంతో అతనితో పాటు వాహనాలు స్వాధీనం చేసుకుని పీలేరు పట్టణంలో సంచలన వార్త తెలియజేశారు ప్రజలు కూడా దొంగలపై పీలేరు సర్కిల్ ఇన్స్పెక్టర్ నిఘా ఉంచడమే కాకుండా రౌడీ షీటర్లు కూడా కౌన్సిలింగ్ ఇవ్వాలని నిర్ణయించి ప్రజలకు 24 గంటలు పోలీసు వ్యవస్థ కాపాడాలని భావించడం హర్షించదగ్గ విషయమని పలువురు ప్రజలు ప్రముఖులు అభినందించారు.



పట్టుపడ్డ వాహనాలు

## పులివెందులలో స్పెషల్ డ్రైవ్... మైనర్ల వాహనాల సీజ్

పులివెందుల, మార్చి 3, ప్రభాతవార్త :



జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు, పులివెందుల డీఎస్పీ మురళి ఉత్తర్వుల ప్రకారం పులివెందుల పట్టణంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ హాజీవల్లి తన సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. స్పెషల్ డ్రైవ్ సందర్భంగా మైనర్లు నడుపుతున్న వాహనాలను గుర్తించి సీజ్ చేశారు. అనంతరం సంబంధిత మైనర్ల తల్లిదండ్రులను ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. మైనర్లకు బైకులు ఇవ్వడం చట్టపరంగా తప్పు అని, ఇలాంటి ఘటనలు పునరావృతమైతే సంరక్షకులు మరియు వాహన యజమానులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం, రాష్ డ్రైవింగ్ చేయడం, మద్యం సేవించి వాహనం నడపడం, ట్రిపుల్ రైడింగ్ చేయడం వంటి నిబంధనల ఉల్లంఘనపై ఇటీవల అమలులోకి వచ్చిన చట్టాల గురించి అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని పోలీసులు తెలిపారు.పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ మరియు రోడ్డు భద్రత కోసం ఇలాంటి ప్రత్యేక డ్రైవ్‌లు నిరంతరం కొనసాగు తాయని తాయని అధికారులు వెల్లడించారు.

## వైకాపా చెత్త మీద పన్ను వేస్తే మేము ఆ చెత్తనే కొంటున్నాం

తంబళ్లపల్లె ఫిబ్రవరి 3 ప్రభాతవార్త ః



నాటి వైకాపా ప్రభుత్వం చెత్త మీద పన్ను వేసి చెత్త ప్రభుత్వం గా నిలవగా మా ఎన్డీఏ ప్రభుత్వం ఆ చెత్తని ప్రజలకు సేవ చేస్తున్నట్లు రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర చైర్మన్ పట్టాభిరామ్ తెలిపారు. మంగళవారం ఆయన స్వచ్ఛ ఆంధ్రపై తంబళ్లపల్లె నియోజకవర్గంలోని అధికారులతో జరిగిన సమీక్ష లోఆయన ఆరు మండలాల ఎంపీడీవోలతో పారిశుధ్యం తో పాటు డంపింగ్ యార్డ్ ల నిర్వహణ, చెత్త సేకరణ, ఎరువుల తయారీ, స్వచ్ఛ వాహనాలపై విడివిడిగా చర్చించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దేశంలోనే ఎక్కడా లేని విధంగా పారిశుధ్యనికి పెద్ద పీట వేసి నెలలో ప్రతి మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం చేపట్టిన ఘనత ఆయనదేనన్నారు. అధికారులు అంకెల గారిడి లేకుండా చిత్తశుద్ధితో చెత్త సేకరణ పై దృష్టి సారించి స్వచ్ఛరథాల నిర్వహణ లోపం లేకుండా చూడాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 200 ప్లాస్టిక్ మేనేజ్మెంట్ యూనిట్లు, 12 వేలకు పైగా ట్రై సైకిళ్లు, 5000 స్వచ్ఛ రథాలు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం పారిశుధ్యం పై నిరక్ష్యంల్ల వహించిందని నేడు ఎన్డీఏ పాలనలో స్వచ్ఛ ఆంధ్ర కు ప్రాధాన్యతనిచ్చి పల్లె సీమలు పర్యావరణ పరిరక్షణ తో అభివృద్ధి చెందడానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. పారిశుద్ధంతో పాటు తాగునీటి సమస్యలు, మౌలిక సదుపాయాలపై నాయకులు అధికారుల సమన్వయంతో అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఓ రాధమ్మ, డిఎల్‌పిఓ నాగరాజు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ సతీష్ కుమార్, డిఈ చంద్రశేఖర్ రెడ్డి, ఏఈ వినోద్ కుమార్ ఎంపీడీవోలు, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## లక్ష్మీ పాలెంలో మోహిని అలంకారంలో

# భక్తులకు దర్శనం ఇచ్చిన శ్రీవారు

బద్వేలు అర్బన్ ,మార్చి 3, ప్రభాతవార్త



బద్వేల మండలం లక్ష్మి పాలెంలో మోహిని అలంకారంలో భక్తులకు శ్రీవారు దర్శనమిచ్చారు. మంగళవారం డిసిసి బ్యాంకు చైర్మన్ సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు. లక్ష్మి పాలెం గ్రామంలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి వార్షికోత్సవాలు అంగరంగ వైభవంగా కనుల పండుగగా జరుగుతున్నాయి. ఈ ఏడాది గతంలో ఎన్నడూ జరగని విధంగా వేడుకలు జరుగుతుండడంతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారి దర్శనానికి విచ్చేస్తున్నారు. మంగళవారం స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీవారిని మోహిని అలంకారంలో అలంకరించి భక్తుల దర్శనం అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు మెంటా రాఘవయ్య కుటుంబం స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం ఉత్సవాలను నిర్వహించారు. కడప డిసిసి బ్యాంక్ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి టిడిపి బద్వేల్ పట్టణ మాజీ అధ్యక్షుడు కుంకుల రాంబాబు టిడిపి సీనియర్ నాయకులు రవికుమార్ జై రామ్ రెడ్డి పెద్ద ఎత్తున అనుచరులతో లక్ష్మీపాలెం గ్రామానికి పెద్ద కాన్వాయ్ తో వచ్చారు శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు వేద పండితులు వారికి ఆలయ మర్యాదలతో సన్మానం చేశారు ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు బ్రహ్మోత్సవాలు బాగా జరుగుతున్నాయని ఆలయ కమిటీ వారిని వారు మెచ్చుకున్నారు ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామన్నారు. చంద్రగ్రహణం ముగిసిన తర్వాత రాత్రి గరుడ వాహనంపై శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారిని పూలతో అలంకరించి భక్తుల దర్శనం అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.. గ్రామోత్సవం వెంట ఒకవైపు మంగళ వాయిద్యాలు మరోవైపు కడప కు చెందిన శ్రీ కోదండ రామయ్య చెక్కభజన కోలాట బృందం వారు సందడి చేస్తూ భక్తులకు వినోదాన్ని కలిగించారు. వందల సంఖ్యలో పాల్గొన్న భక్తులకు స్వామి దర్శనం ఎటువంటి అంతరాయం కలగకుండా బద్వేల్ పట్టణ పోలీసు వారు బందోబస్తు నిర్వహించి అందరికీ స్వామి దర్శనం కలిగేటట్లు చేశారు బుధవారము రాత్రి శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం మరియు పాట కచేరి ఏనుగు వాహనంపై స్వామివారి గ్రామోత్సవము కనుల పండుగ జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకులు మొగదలై భరద్వాజ భక్తులకు విన్నవించారు .ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చాటకొండు సత్య సంజీవ కుమార్ ఆలయ ధర్మకర్తలు కర్ణమడకల బీనా మెంటా ప్రసన్న కిరణ్ కుమార్ నల్లి వీరమ్మ సంపతి, వెంకటసుబ్బయ్య, అనగొంది ఓబులేసు, లక్ష్మమ్మ ,ఒంటె పేరయ్య, నాగయ్య గారి సిద్ధమ్మ, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

# మోస్ పట్టిన చేతులతో గొలుసుల దొంగతనం

**నిందితుడి అరెస్ట్, రూ. 40 లక్షల విలువైన బంగారం, వెండి స్వాధీనం... ఎస్పీ ధీరజ్ కునుబిల్లి**


మదనపల్లెక్రైమ్, మార్చి 3 ప్రభాతవార్త.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా సమాజంలో గౌరవప్రదమైన స్థితిలో ఉండాల్సిన ఒక వ్యక్తి, విలాసాలకు అలవాటు పడి దొంగగా మారిన ఘటన అన్నమయ్య జిల్లాలో వెలుగుచూసింది. వరుస దొంగతనాలకు పాల్పడుతున్న మోస్ట్ వాంటెడ్ 'హాబిచ్యువల్ అఫెండర్'ను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుండి సుమారు రూ. 40 లక్షల విలువైన 250 గ్రాముల బంగారు ఆభరణాలు, 930 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి వెల్లడించారు. మదనపల్లె మండలం ఈశ్వరమ్మ కాలనీకి చెందిన కోరకూటి రాజేష్ (35) వృత్తిరీత్యా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. కరోనా సమయంలో ఉద్యోగం కోల్పోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో, విలాసవంతమైన జీవితం కోసం దొంగతనాలను వృత్తిగా మార్చుకున్నాడు. మదనపల్లె పట్టణం, కజిన్స్ స్ట్రీట్ లో ఉంటున్న రెడ్డి ప్రసాద్ ఫిబ్రవరి 16 న ఊరికి వెళ్లడంతో రెక్కీ నిర్వహించిన రాజేష్ ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న 200 గ్రాముల బంగారు ఆభరణాలు, 2 కిలోల వెండి వస్తువులు దొంగలించాడు. రెడ్డి ప్రసాద్ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు, సాంకేతిక ఆధారాలతో నిందితుడిని పట్టుకున్నారు. విచారణ లో మరో రెండు దొంగతనాలు చేసినట్లు నిందితుడు అంగీకరించాడు. గత ఏడాది మార్చి 24న దేవలం వీధిలోని వృద్ధురాలు రాజమ్మ మెడలోని 30 గ్రాముల చైన్ ను, ఫిబ్రవరి 6న దేవాలం వీధిలోనే మరో వృద్ధురాలు విజయ మెడలోని 25 గ్రాముల బంగారు గొలుసును దొంగిలించాడు. నిందితుడి నుంచి బంగారు, వెండిని స్వాధీనం చేసుకొని రిమాండ్ తరలించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు బానిసలై నేరాల బాట పట్టడం వల్ల వారి భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. చదువుల్లో రాణించి జీవితంలో పైకి రావాలి తప్ప, దొంగతనాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కేసు దర్యాప్తులో ప్రతిభ చాటిన సి.సి.ఎస్ ఇన్ స్పెక్టర్ ఎం. చంద్రశేఖర్, 1టౌన్ సి ఐ రాజారెడ్డి, ఎస్.కె రహమతుల్లా, పోలీస్ అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించి, నగదు రివార్డులను అందజేశారు.



## తంబళ్లపల్లె కోర్టుకు హాజరైన కొమ్మిరెడ్డి పట్టాభిరామ్.

తంబళ్లపల్లె ఫిబ్రవరి 3 ప్రభాతవార్త ః



మంగళవారం తంబళ్లపల్లె జూనియర్ సివిల్ కోర్టుకు రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర చైర్మన్ కొమ్మిరెడ్డి పట్టాభిరామ్ హాజరయ్యారు. 2023లో ఓ టీవీ డిబేట్లో అప్పటి వైకాపా ప్రభుత్వంతో పాటు నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు గాను అప్పట్లో తంబళ్లపల్లె వైకాపా నాయకులు పరువు నష్టం పై కోర్టులోదావా వేశారు. ఆ కేసు నిమిత్తం మంగళవారం ఆయన తంబళ్లపల్లె కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాల నుండి పెద్ద ఎత్తున టిడిపి, కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరై ఆయనకు సంఘీభావం తెలిపారు. కోర్టు బయట పట్టాభిరామ్ కు సన్మానించి కూటమి ప్రభుత్వం వర్ధిల్లాలి నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా కోర్టు వద్ద ఎస్సై అనిల్ కుమార్ సారథ్యంలో బందోబస్తు నిర్వహించారు.

# దిలీప్ భౌతికకాయానికి నివాళులు

**కాశినాయన మార్చి 03 ప్రభాతవార్త:**
మండలం, గంగనపల్లి గ్రామానికి చెందిన దళిత యువకుడు దిలీప్ బౌతి కాయానికి నివాళులు అర్పించి,హత్యకు గురైన ఘటన ప్రతి మనిషి మనసును కలచివేసింది అని ఒక అమాయక యువకుడిని పెట్రోల్ పోసి దహనం చేయడం అనేది మానవత్వానికి ఒక మచ్చ లాంటిది అన్నారు. ఇది కేవలం ఒక కుటుంబానికి జరిగిన విషాదం మాత్రమే కాదు.. మానవ సమాజానికి జరిగిన అవమానం అని కడప డిసిసి బ్యాంక్ చైర్మెన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి తీవ్రంగా స్పందించారు. మంగళవారం శ్రీ అవధూత కాశి నాయన మండలం లోని గంగనపల్లి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను స్వయంగా పరామర్శించారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న తల్లిదండ్రులను ధైర్యం చెప్పి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కష్టసమయంలో ఆ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇస్తూ, తన వంతుగా తక్షణ సహాయంగా రూ. 50,000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఎంతటి ప్రభావం ఉన్న వారైనా సరే చట్టం ముందు అందరూ సమానమేనని స్పష్టం చేశారు. బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు విశ్రమించేది లేదని బద్వేల్ తెలుగుదేశం పార్టీ తరఫున మేము ఈ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని సూర్యనారాయణ రెడ్డి తెలిపారు.మన కూటమి ప్రభుత్వం దళితుల రక్షణకు కట్టుబడి ఉందని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున అందాల్సిన అన్ని రకాల సహాయ సహకారాలు ఆర్థిక సహాయం, న్యాయ సహాయం, భద్రత త్వరగా అందేలా చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. సమాజంలో ఇ



లాంటి దారుణాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటాం అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ ఓబులాపురం రాజశేఖర్, చెరుకూరి రవికుమార్అరవ శ్రీనివాసులురెడ్డి,పరిటాల వెంకటసుబ్బయ్య, భిరం జయరామిరెడ్డి, బాలిరెడ్డి, ప్రహల్లదరెడ్డి, వెంకటరెడ్డి, రమణా రెడ్డి, మొగల్ రహమతుల్లా, రామయ్య, శంకర్ రెడ్డి, సిద్ధారెడ్డి, మాచుపల్లి క్రిష్ణారెడ్డి, సుబ్బారాయుడుయాదవ్, కరుణాకర్,జోజయ్య, సమరసింహారెడ్డి, బోవిల్ల నరసింహారెడ్డి,బైసాని శివరాం రెడ్డి,ఉపత్తి సుబ్బారెడ్డి,రామకృష్ణ కమలకూరు, మల్రెడ్డి నవీన్ రెడ్డి,గురుప్రసాద్ రెడ్డి,శీను,షేక్ రఫీ, సురేంద్ర, సందీప్, వంశీ తదితరులు పాల్గొని బాధిత కుటుంబానికి సంఘీభావం ప్రకటించారు.

# 'స్పెషాలిటీ కాఫీ'ల తయారీలో క్యూ గ్రేడర్‌గా..





**'స్పెషాలిటీ కాఫీ'ల తయారీలో క్యూ గ్రేడర్‌గా కాఫీ పరిమళం.. ఆ ఘుమఘుమల గురించి తెలిసిందే! ఇంకా కొత్తగా ఏం తెలుసుకుంటాం అంటారా? కాఫీ అనే సబ్జెక్ట్ సముద్రమంత! దాని గురించి ఎంత తెలుసుకున్నా తక్కువే అంటారు 'స్పెషాలిటీ కాఫీ'ల తయారీలో క్యూ గ్రేడర్‌గా రాణిస్తున్న శ్రీరాజాకలిదిండి చాందిని. ఆ కాఫీ గూర్చి తెలుసుకుందాం..**

నా స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లాలోని మొగల్లూరు. నాన్న చంద్రశేఖర్‌రాజు, వ్యవసాయం చేసేవారు. వ్యాపారవేత్త కూడా. అమ్మ లత గృహిణి. చిన్నప్పట్నుంచీ ఏదైనా కొత్తగా ప్రయత్నించు అనేవారు అమ్మానాన్నలు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్‌లో ఇంజినీరింగ్ చేశాక పుణెలో రెండేళ్లు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేశా. పెళ్లైన తర్వాత ఎంబిఎ చేయడం కోసం యుకె వెళ్లాను. యూనివర్సిటీ ఆఫ్ ఎడినబర్ నుంచి న్యూవెంచర్ క్రియేషన్‌లో ఎంబిఎ చేశా. కొన్ని క్లాసులు సుదీర్ఘంగా సాగేవి. అలాంటప్పుడు బోర్ కొట్టకుండా మా కాలేజీ ముందుండే ఓ కేఫేకి వెళ్లేదాన్ని. అక్కడ కాఫీ రుచి చాలా ప్రత్యేకంగా ఉండేది. ఆరాతీస్తే అవి స్పెషాలిటీ కాఫీలన్నారు. అంతవరకూ నేను తాగిన ఆర్టిఫిసియల్ ఫ్లేవర్డ్ రుచులకూ, వీటికీ చాలా తేడా ఉంది. ఇవి ఎందుకింత ప్రత్యేకం అని రిసెర్చ్ మొదలుపెట్టా. ది బెస్ట్ కాఫీని నిర్ణయించడంలో 100 పాయింట్లు ఉన్నాయనుకుంటే.. ఈ స్పెషాలిటీ వాటికి 80 కంటే ఎక్కువ పాయింట్లు ఇస్తారు క్యూగ్రేడర్లు. కాఫీ పరిమళం, రుచిని నిర్ణయించే నిపుణులచే క్యూగ్రేడర్లు అంటారు. వైన్, టి రుచులని నిర్ణయించేందుకు సమోలియర్స్ అని ఎలా ఉంటారో, అలా ఈ కాఫీ రుచి కోసం క్యూ గ్రేడర్స్ ఉంటారు. ఇందుకు ప్రత్యేకంగా లైసెన్స్ కూడా ఉంటుంది. ఈ స్పెషాలిటీ వాటిల్లో ఎక్కడా కృత్రిమ రుచులు, చికోరి వంటి వాటిని కలపరు. కాఫీ గింజల ఎంపిక, వివిధ ప్రక్రియల్లో రోస్ట్ చేయడంలోనే ఆ రుచంతా దాగి ఉంటుంది. ముఖ్యంగా ఎత్తైన ప్రదేశాల్లో పండించిన గింజలని మాత్రమే ఇందుకు వాడతారు. మనదేశంలో చిక్‌మగళూరు, కూర్గ్, తమిళనాడు వంటి ప్రాంతాల్లో పండించిన అరాబికా గింజలని ఇందుకు ఎంచుకుంటారు. బ్రెజిల్, ఇటలీ, లండన్ వంటిచోట్ల తిరిగి నిపుణులని కలిసి ఈ కాఫీల తయారీలో మెలకువలు నేర్చుకున్నా. కోవిడ్ సమయంలో ఇండియాలోనే ఉన్నా. అప్పుడేం చేయాలో తోచేది కాదు. ఆ సమయంలో ఒక కేజీ సామర్థ్యం ఉండేరోస్టింగ్ మెషీన్ కొనుక్కొని సొంతంగా ప్రయోగాలు చేశా. కొంతమంది ఎస్టేట్ యజమానులని కలిసి వాళ్ల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్న తరవాత.. చుట్టుపక్కల కెఫేలకు వాళ్లు కోరిన రుచుల్లో కాఫీ పొడిని సరఫరా చేయడం మొదలుపెట్టాను. సాధారణంగా నాలా ఇండిపెండెంట్ రోస్టర్‌లు చాలా తక్కువగా ఉంటారు. పెద్ద పెద్ద రెస్టరంట్లూ, సంస్థల్లో అక్కడే మెషీన్లు పెట్టి రోస్ట్ చేస్తూ ఉంటారు. నాకు మాత్రం సొంతంగా పెట్టుకుని రాణించాలనిపించింది. అలా 'ఫస్ట్ క్రాక్ స్పెషాలిటీ రోస్టర్స్' సంస్థను స్థాపించా. కాస్త అనుభవం వచ్చాక.. ఇటలీలోని ఫ్లోరెన్స్‌కి వెళ్లి అక్కడి కాఫీ కోర్సులు నేర్పించే ఎస్ప్రెసో అకాడమీ నుంచి ప్రొఫెషనల్ రోస్టర్‌గా సర్టిఫికెట్ అందుకున్నా. ఆ సమయంలో మా పాప చిన్నది. తనని మా అమ్మ దగ్గర వదిలి ఈ పరీక్షలకు హాజరయ్యా.

ఆ తరవాత కాఫీ గింజల ఎంపిక కోసం ఎవరిపై ఆధారపడకుండా సొంతంగా గ్రేడింగ్ చేసుకొనేందుకు వీలుగా క్యూ గ్రేడర్‌గా మారాలనుకున్నా. ఇందుకూ శిక్షణ తీసుకున్నా. పరిమళం, రుచి, ఆకారం ఆధారంగా కాఫీ గింజలని ఎంచుకోవడం నేర్పిస్తారు. ఇక కాఫీ రుచి నిర్ణయించడానికి కప్పింగ్ చేయడం అంటారు. ప్రపంచ వ్యాప్తంగా దొరికే కాఫీ పొడులని సబ్‌స్క్రైబ్ చేసుకుని వాటి రుచి చూసేదాన్ని. ఆ సమయంలో గీషా వంటి ఎన్నో ఖరీదైన కాఫీల గురించి తెలిసింది. కాఫీల్లో వాడే నాణ్యమైన గింజల కోసం దేశమంతా తిరిగాను. ఇప్పుడు కాఫీల గురించి తెలిసింది. కాఫీల్లో వాడే నాణ్యమైన గింజల కోసం దేశమంతా



తిరిగాను. ఇప్పుడు చిక్‌మగళూరు రైతులతో కలిసి ఈ గింజల్ని సేకరిస్తున్నా. దేశవ్యాప్తంగా 60 మంది క్యూ గ్రేడర్స్ ఉంటే అందులో నేనొక్కదాన్ని. ప్రస్తుతం ఐదుకేజీల ప్రొబాట్ రోస్టర్‌తో.. ఎస్ప్రెసో, సింగిల్ ఎస్టేట్ పోరోవర్స్, కోల్డ్ బ్రూ బ్లెండ్స్ కాఫీలకు అవసరం అయిన కాఫీ పొడులని కెఫేలు, రెస్టరంట్లకు అందిస్తున్నా. స్పెషాలిటీ కాఫీ రంగంలో మాదైన ముద్ర ఉంది. త్వరలో ఈకామర్స్‌లోకి వచ్చి రిటైలర్స్‌కీ చేరువ్వాలనేది నా లక్ష్యం.

# పెద్దమ్మాయికి బాధ్యత ఎక్కువ..

**చిన్నదానికి దెబ్బ తగిలింది, కూడా ఉన్నావుగా.. చూసుకోలేదా.. అంటూ ఇంట్లో పెద్ద పిల్లలను అజమాయిషీ చేస్తారంతా. తీరా చెల్లెలికన్నా పెద్దమ్మాయిది రెండేళ్లు ఎక్కువ ఉంటుంది.**
**అయినా చిన్నవాళ్ల బాధ్యత పెద్దవాళ్లదే అంటారంతా. దీంతోపాటు పుట్టిన క్రమం**
**పిల్లల వ్యక్తిత్వాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తుందంటున్నాయి పలు పరిశోధనలు.**

సంతానంలో పిల్లలు పుట్టే క్రమం వారి స్వభావం, ప్రవర్తనను ప్రభావితం చేస్తాయంటున్నాయి అధ్యయనాలు. అందరికన్నా పెద్దవాళ్లు కుటుంబం లో బాధ్యతగా, నాయకత్వ స్థానంలో ఉంటాయి. తల్లి దండ్రుల ఏకాగ్రత, అడిగిందల్లా పొందడం వంటివన్నీ ముందుగా వీరికే దక్కుతాయి. దీంతో అందరి ప్రేమ దక్కి తాము కూడా స్నేహభావంతో ఉంటారు. తన తర్వాత పుట్టిన పిల్లల బాధ్యత రావడంతో బాధ్యతాయుతంగా మారతారు. తమ్ముడు అల్లరి చేస్తే తప్పు అని చెప్పాలి కదా అనే తల్లిదండ్రుల మాటలతో తనకన్నా చిన్న వారికి తాను రోల్‌మోడల్‌గా ఉండాలనే వ్యక్తిత్వం వస్తుంది.

**మధ్యవాళ్లు..** తనకన్నా పెద్దవాళ్లు, చిన్నవాళ్లకు మధ్య సతమతుల్యంగా ఉంటారు. తమకంటూఐ గుర్తింపు పొందడానికి కృషి చేస్తూ, నైపుణ్యాలను పెంచుకుంటారు. తమకన్నా పెద్దవారికి, చిన్నవారికి సహకారానినన అందిస్తూ, వాళ్ల మధ్య వచ్చే విభేదాలకు మధ్యవర్తిత్వం వహిస్తారు. ఇక, చివరి పిల్లలు పుట్టే సమయానికి తల్లిదండ్రులకు పెంపకంలో అనుభవం వస్తుంది. ఒత్తిడికి గురికాకుండా పెంచడంవల్ల ఈ పిల్లల్లో ఆందోళన ఉండదట. అందరి ప్రేమ పొంది గారంగా పెరుగుతారు. నిర్లక్ష్యం వైఖరి వస్తుంది. నియమాలు, నిబంధనలు సడలి సాహసోపేతంగా ఉంటారు.

**ఒకే ఒక్కరైతే...** తల్లిదండ్రుల నుంచి ఎక్కువ ప్రేమ దొరుకుతుంది. పోటీ లేకుండా పెరుగుతారు. మనసుకు నచ్చింది చేస్తారు. అమ్మానాన్నతో



ఎక్కువ గడుపుతారు. అయితే అనుకున్నది అందకపోతే తీవ్రమైన ఒత్తిడికి గురవుతారు. ఉన్నతవిద్యను అభ్యసించడంలో, సామాజిక నైపుణ్యాలను పెంపొందించుకోవడంలో ముందుంటారట. పిల్లల వరుసక్రమం ప్రకారం కాకుండా, ప్రతి సంతానం వ్యక్తిగత జలాలను పెంపొందించేలా తల్లిదండ్రులు మద్దతు అందించగలిగతే వాళ్ల వ్యక్తిత్వాన్ని సరైన రీతిలో మలచొచ్చు అంటున్నారు నిపుణులు.

# పావ్‌భాజీ మసాలా



**వీధుల్లో దొరికే తినుబండారాల్లో చిన్నా పెద్దా అందరికీ నచ్చేస్తుంది పావ్ భాజీ.** ఇది ఇంట్లోనే చేసుకోవచ్చు. ఆ మసాలా పొడి గనుక సిద్ధంగా ఉంటే.. ఈ వర్షాకాలం ఎప్పుడంటే అప్పుడు వేడివేడిగా పావ్‌భాజీ తిని ఆనందించవచ్చు.



పావ్‌భాజీ మసాలా కోసం.. ధనియాలు-4 టేబుల్ స్పూన్లు, జీలకర్ర- 2 టేబుల్ స్పూన్లు, ఆమ్‌చూర్ పౌడర్, మిరియాలు-టేబుల్ స్పూన్ చొప్పున, సోంపు-ముప్పావు టేబుట్ స్పూన్, కశ్మీరీ ఎండుమిర్చి-8, లవంగాలు-10, యాలకులు-2, ఒక బిర్యానీ ఆకు, రెండు అంగుళాల దాల్చినచెక్క, చెంచా పసుపు సిద్ధంగా ఉంచుకోవాలి. కడాయిలో ధనియాలు, జీలకర్రలను మంచి వాసన వచ్చేదాకా వేయించాలి. వాటిని పళ్లెంలోకి తీసి.. బిర్యానీ ఆకు, దాల్చినచెక్క, మిరియాలు, యాలకులు, లవంగాలు, సోంపులను వేయించాలి. చివర్లో కశ్మీరీ ఎండుమిర్చిని కూడా వేయించాలి. అన్నిటినీ చల్లారనిచ్చి.. ఆమ్‌చూర్ పౌడర్, పసుపు చేర్చి మెత్తడి పొడి చేయాలి. ఇక తినాలనిపించినప్పుడు ఉల్లి, టొమాటో, క్యాప్సికం, బంగాళదుపం, బఠాణీలతో చేసే భాజీలో-పావ్‌భాజీ మసాలా జోడించాలి. పావ్‌లను వెన్నతో వేయించి.. భాజీతో తింటే మస్ట్ మజానే కదా!

## అంగన్వాడీ కార్యకర్తలను అరెస్ట్ చేయించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య

### అధ్యక్షురాలు కాల్వపల్లి చిన్నమ్మ



**పీలేరు మార్చి 3 ప్రభాతవార్త:**
శాంతియుత రిలే నిరాహార దీక్షలు చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలను అరెస్ట్ చేయడం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వెన్నతో పెట్టిన విద్యే అని వైఎస్సార్టీయూసీ అంగన్వాడీ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కాల్వపల్లి చిన్నమ్మ తెలిపారు. మంగళవారం పీలేరులో ఆమె మీడియాతో మాట్లాడుతూ గతంలో 14 సంవత్సరాలు చంద బాబు ముఖ్యమంత్రిగా పని చేసిన రోజుల్లోనూ అనేక మార్లు అరెస్టులు, సస్పెండ్లు, ఇవేకాక గుర్రాలతో తొక్కించిన సంఘటనలు జరిగాయని గుర్తు చేశారు. ప్రస్తుతం మరోసారి అంగన్వాడీ సిబ్బందిని అరెస్టు చేయించి తన నైజాన్ని చాటుకున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వ పాలనలోనూ అంగన్వాడీ సిబ్బంది 42 రోజుల పాటు శాంతియుత దీక్షలు చేపట్టిన ఫలితంగా అప్పటి ప్రభుత్వం కొంత మేరకు వారి డిమాండ్లను పరిష్కరించడంతోపాటు చర్చించిన అంశాలు మినిట్స్ లో పొందుపరచడం జరిగిందన్నారు. సమ్మెకాలానికి వారికి వేతనాలు కూడా మంజూరు చేయడం హర్షించదగ్గ విషయమని చెప్పారు. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా, అంగన్వాడీ సిబ్బంది ఎన్ని సార్లు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాగానే అసెంబ్లీలో ఎమ్మెల్యేల జీతాలు పెంచి, వారి సౌకర్యాల కోసం మాత్రం బడ్జెట్ ఉంటుందని, అదే చాలీచాలని జీతాలతో కాలం వెళ్లదీస్తున్న అంగన్వాడీలకు వేతనాలు పెంచడానికి బడ్జెట్ లేదని చెప్పడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. అంగన్వాడీలను అరెస్ట్ చేయించి ఉద్యమాలు ఆపడమంటే అది అవివేకమేనని చెప్పారు. ఈ బెదిరింపులకు భయపడేది లేదని, అంగన్వాడీల డిమాండ్లు పరిష్కారం అయ్యే వరకు తమ ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## రహదారి నిర్మాణంలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయకుండా నిరక్ష్యం

**ముద్దనూరు,మార్చి 03,ప్రభాతవార్త:**
మండల పరిధిలోని ముద్దనూరు పులివెందుల జాతీయ రహదారిలో నాలుగు లైన్ల జాతీయ రహదారి నిర్మాణంలో కాంట్రాక్టర్ సూచిక బోర్డులు లేకుండా నిర్మాణాలు చేపట్టడంతో ద్విచక్ర వాహనదారులు, వాహనదారులు ఈ రహదారి వెంబడి తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. మంగళవారం నాడు రహదారి నిర్మాణ పనులు చేపడుతున్న ఎన్ ఎస్ పి ఆర్. ఆర్ హెచ్ ఎం ప్లాంట్ ఇంజనీర్ గా విధులు చేపడుతున్న వై కోడూరు గ్రామానికి చెందిన రామాంజనేయరెడ్డి ముద్దనూరు వైపు నుంచి ద్విచక్ర వాహనంలో వెలుతూ ఉండగా నల్లబల్లె గ్రామ సమీపాన రహదారి పక్కన మట్టి కుప్పలను ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలైన ఘటన చోటుచేసుకుంది. స్థానికులు హుటాహుటిన గాయపడిన వ్యక్తిని ప్రొద్దుటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా రహదారి నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ నిర్మాణాలు చేపడుతున్న ప్రదేశాలలో సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా నిలువరించాలని వాహనదారులు ప్రయాణికులు కోరారు.

## రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన

**కడప క్రైం, మార్చి 3, ప్రభాతవార్త:**
ఊటుకూరు సర్కిల్ వద్ద సి.కె.దిన్నె సీఐ బాల మద్దిలేటి ఆధ్వర్యంలో మంగళవారం వాహనదారులకు ట్రాఫిక్ ఎనియమ నిబంధనలు వివరించారు. సీటు బెల్టు ధరించాలని ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఆయన సూచించారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వకూడదని, మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహనాలు సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించడం జరుగుతుందన్నారు. కంపెనీ ఫిట్టెడ్ సైలెన్సర్లు కాకుండా మార్చివేసి అధిక శబ్దం వచ్చి ధ్వని కాలుష్యం కలిగించే ఇతర సైలెన్సర్లు బిగించి నడిపే ద్విచక్ర వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. యువత ఓవర్ స్పీడ్, ర్యాష్, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసి ప్రమాదాల బారిన పడుతున్నారని, డ్రైవింగ్‌లో సెల్‌ఫోన్ మాట్లాడడం ప్రమాదకరమని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల వల్ల ఒక కుటుంబం ఆర్థికంగా ఎంతో నష్టపోతుందని, కుటుంబ పెద్ద తీవ్రంగా గాయపడితే కుటుంబ సభ్యుల మనోవేదన లాంటి దుస్థితి ఎవరికీ రాకూడదన్నారు. అందరూ తమ వంతు బాధ్యతగా రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సహకరించాలని సీఐ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

## ఇంటింటికి వెళ్లి ఆగాహన కల్పించాలి..



**సుండుపల్లి మార్చి 03,ప్రభాతవార్త :**
సుండుపల్లి మండలంలో ఇంటి పన్ను, నీటి పన్ను వసూళ్లు త్వరితగతిన పూర్తి చేయాలని అధికార యంత్రాంగం చర్యలు ప్రారంభించింది. ఈ మేరకు డివిజనల్ పంచాయతీ అధికారి మస్తాన్వలి, ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో కలిసి పంచాయతీ కార్యదర్శి పవన్ కుమార్ మరియు సిబ్బందితో కలిసి పన్ను వసూళ్లపై ఫీల్డ్ విజిట్ నిర్వహించారు.గ్రామాల్లో టాక్స్ వసూళ్ల ప్రక్రియను పరిశీలించిన అధికారులు, ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు పన్నుల వసూళ్లు కీలకమని తెలిపారు.మండల ప్రజలందరూ మార్చి 15లోపు ఇంటి పన్ను మరియు నీటి పన్ను 100 శాతం చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## 14 రోజుల రిమాండ్

**కాశినాయన మార్చి 03 ప్రభాతవార్త :**
అవధూత కాశినాయన మండలం, పాపిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన పాలకొలను సీతారామిరెడ్డి, తండ్రి. కీ//శే. వీరారెడ్డి (ముద్దాయి) పాపిరెడ్డిపల్లె లో ఉన్న తన పెసర పంట గల పొలానికి అడివిపందుల నుండి కాపాడుకోవడం కోసం పొలం చుట్టూ బివైరు అమర్చి దానికి కరెంటు పెడుతూ ఉండగ అదేగ్రామానికి చెందిన వర్రా రాజు, వయస్సు. 48 సం,, తండ్రి. కీ//శే. సుబ్బయ్య (మృతుడు) అను అతను 24.02.2026 వ తేది సాయంత్రం తప్పిపోయిన తన గొర్రెపిల్ల ను వెతుకుతూ వెళ్ళి ముద్దాయి పొలంలో కరెంటు ఉన్న బివైరు పై పడి చనిపోవడం జరిగినది. పై విషయం పై వర్రా రాజు చిన్న కుమార్తె అయిన వర్రా మల్లీశ్వరి గఇచ్చిన ఫిర్యాదు మేరకు పై కేసు నమోదు చేసి విచారణ చేపట్టడం జరిగినది.పై కేసులో ముద్దాయి అయిన పాలకొలను సీతారామిరెడ్డి, వయస్సు. (58 సం,,) ని ఈ రోజు అనగా 03.03.2026 వ తేది ఉదయం 09:15 గం,, లకు శ్రీ. అవధూత కాశినాయన పోలీస్ స్టేషన్ ఖీ। శి.యోగింంద్ర పాపిరెడ్డిపల్లె గ్రామ క్రాస్ రోడ్డు వద్ద అరెస్ట్ చేసి గౌరవ తి.రి.ది.రి కోర్ట్ కు హాజరు పరచగా గౌరవ తి.రి.ది.రి కోర్ట్ వారు ముద్దాయికి 14 రోజులు రిమాండ్ ఇవ్వడం జరిగినది అని ఆయన అన్నారు.

## అంగన్వాడీల అక్రమ అరెస్టుల పట్ల సీఐటీయూ, ఏఐటీయూసీ ఖండన





**రాజంపేట, మార్చి 3 ప్రభాతవార్త:**
అంగన్వాడీ సిబ్బంది తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా 30 గంటల ధర్నా నిర్వహిస్తున్న సమయంలో, వారు నిద్రిస్తుండగానే విజయవాడ ధర్నా చౌక్ వద్ద అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమని సీఐటీయూ, ఏఐటీయూసీ మండిపడింది. అక్రమ అరెస్టులను ఖండించింది. ఈ మేరకు ఐసిడిఎస్ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలు రవికుమార్, ఏఐటీయూసీ సహాయ కార్యదర్శిసికిందర్, అంగన్వాడి ప్రాజెక్ట్ ఉపాధ్యక్షురాలు టి ఈశ్వరమ్మ మాట్లాడుతూ, అంగన్వాడీలకు జీతాలు పెంచి న్యాయం చేస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఇప్పుడు మాట తప్పి వారిపైనే నిర్బంధ చర్యలకు దిగడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.అరెస్టు చేసిన అంగన్వాడీ సిబ్బంది ,వారి నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మీరు చెప్పిన మాటను తప్పకుండా అమలు చేస్తారని ఆశిస్తే ఈరోజు ఇంత దుర్మార్గంగా ఆడవారని కూడా చూడకుండా కూటమి ప్రభుత్వం మహిళల పట్ల ఎంతో గౌరవం ఉందని చెప్పారు కానీ ఈరోజు చేసిన పని ఎంత కిరాతంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా అంగనవాడి సమస్యలు చర్చలకు పిలిపించి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పివి రమణ. ఎంవి ప్రసాద్. అంగన్వాడి కార్యకర్తలు శివరంజని. అమరావతి, మమత, అనురాధ, తులసి, రాజేశ్వరి ,తదితరులు పాల్గొన్నారు.

## కమనీయం 'ఉషారాణి' హరికథ పారాయణం



**కలికిరి, మార్చి 3, ప్రభాతవార్త:**
మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీ మేడికుర్తి క్రాస్ వద్ద గ్రామస్థుల సహకారంతో వెంకటేశ్వర నాట్య కళామండలి మేనేజర్ వీరభద్ర ఆధ్వర్యంలో జరుగుతున్న మహాభారత యజ్ఞం విజయవంతంగా జరుగుతోంది. పగటి కథలు తిరుపతికి చెందిన భాగవతారిణి మద్దిపట్ల ఉషారాణిచే హరికథ కార్యక్రమాలు జరుగుతున్నాయి. మంగళవారం ఉషారాణి భాగవతారిణి ఆలపించిన కర్ణుడి జననం హరికథ అందరినీ అలరింపజేసింది. హరికథ కార్యక్రమానికి మర్రికుంటపల్లి, పత్తేగడ, మునోళ్లపల్లి, మేడికుర్తి, కలికిరి గ్రామాల్లో అధిక సంఖ్యలో మహిళలు, ప్రజలు హాజరై హరికథను భక్తి శ్రద్ధలతో వినడం జరిగింది. భాగవతారిణి ఉషారాణి తల్లిదండ్రులైన మోహన్‌నాయుడు, పద్మలు ప్రముఖ కళాకారులు కావడం వారి కుమార్తెగా ఉషారాణి తల్లిదండ్రుల వారసత్వాన్ని పుచ్చుకొని హరికథలు ఆలపిస్తూ అందరి వద్ద ప్రశంసలు అందుకుంటున్నది. తండ్రిమోహన్ నాయుడు ప్రముఖ కళాకారుడంటూ పలువురు కళాకారులు ఎంతో సంతోషంగా చర్చించుకోవడం జరిగింది. ఈ మహాభారత యజ్ఞం కార్యక్రమం ఎంతో విజయవంతంగా ముందుకు సాగుతోంది. అధిక సంఖ్యలో భక్తులు హాజరై పాండవులు, ద్రౌపతీదేవి విగ్రహాలకు పూజలు నిర్వహిస్తున్నారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఈ మహాభారత యజ్ఞ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. కార్యక్రమంలో మర్రికుంటపల్లె పంచాయతీ సర్పంచ్ ఎ.రెడ్డిరామ్, గ్రామపెద్దలు, తబలిస్ట్ ఆంజనేయులు, హార్మోనిస్ట్ హరిబాబు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## కల్వర్టు మధ్యలో గుంత... మరమ్మత్తులు చేయరా

**దువ్వూరు, మార్చి 03, ప్రభాతవార్త:**



మండల కేంద్రమైన దువ్వూరులో మూడు రోడ్ల కూడలిలో ఉన్న కల్వర్టుకు భారి గుంత పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కల్వర్టు వద్ద చిన్న గుంత పడగా దానిని ఎంపీడీవో సుబ్బారెడ్డి తాత్కాలికంగా కంకర వేసి మరమ్మత్తులు చేశారు. మరి కొన్ని చోట్ల కల్వర్టుకు భారి గుంతలు పడ్డాయి. దీంతో వాహనదారులు భయం భయంగా వెళుతున్నారు. భారీ ప్రమాదం జరగక ముందే కల్వర్టుకు మరమ్మత్తులు చేయాలని కోరుతున్నారు. తాత్కాలికంగా గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని పక్కన పెట్టి శాశ్వతమైన పరిష్కారం చూడాలన్నారు. ఇందుకుగాను నూతనంగా కల్వర్టు నిర్మిస్తే అనుకూలంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. దీనిపై రోడ్డు భవనాల శాఖ అధికారులు వెంటనే స్పందించి కల్వర్టు నిర్మించాలని దువ్వూరు ప్రజలు కోరుతున్నారు.

## టపాసుల గోడౌన్ల తనిఖీ





**చిన్నమండెం మార్చి 03 ప్రభాతవార్త:**
మండలంలో ఉన్న శ్రీ సాయి గణేష్ ,వినాయక టపాసుల గోడౌన్ల ను మంగళ వారం డి ఎస్ పి కృష్ణమోహన్,అగ్ని మాపక అధికారి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోడౌన్లలో స్టాకు ఎంత వుంది.నిబంధనల మేరకు అన్ని ఏర్పాట్లు సక్రమంగా వున్నాయ లేదా అని పరిశీలించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గోడౌన్ పరిసరాలను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు.కార్యక్రమంలో యస్ ఐ సుధాకర్ ,తహాశీల్దార్ రామాంజులు,వి ఆర్ ఓ శరణ్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

## వాహనాలు తనిఖీ

**పెండ్లిమర్రి, మార్చి 3, ప్రభాతవార్త:**
పెండ్లిమర్రి సమీపంలో మంగళవారం సీఐ చల్లని దొర తన సిబ్బందితో వాహనాలు ముమ్మరంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వాహనాలకు సరైన పత్రాలు లేని వాటికి సుమారు రూ.2995 జరిమానా విధించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనానికి సంబంధించిన పత్రాలు దగ్గర ఉంచుకోవాలన్నారు. అలాగే రోడ్డు నియమ నిబంధనలు తప్పక పాటించాలని లేనిపక్షంలో జరిమానాలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మల్లూరమ్మ జాతర ఏర్పాట్లను పరిశీలించిన డి యస్ పి

**చిన్నమండెం మార్చి 03 ప్రబాతవార్త:**



మండలంలోని కొత్తపల్లిలో బుధవారం రాత్రి గురువారం జరగనున్న మల్లూరమ్మ జాతర నిర్వహణ ఏర్పాట్లను మంగళవారం డిఎస్‌పి కృష్ణమోహన్ ,రూరల్ సిఐ యస్ కె రోషన్ పరిశీలించారు. ఈ సందర్భంగా పార్కింగ్ స్థలాన్ని ఎక్కడ ఏర్పాటు చేయాలో యస్ ఐ సుధాకర్ తెలిపారు. అలాగే భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు వీలుగా క్యూలైన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.చాందిని బండ్ల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రదర్శనలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

**CHANGE OF SURNAME**
I, **PALLE VENKATA SUNITHA** (Old Surname), W/o POLU VENKATA SUBBA REDDY R/o Door No.7/288-13B, BHAGYA NAGAR COLONY, KADAPA, CUDDAPAH(Dist)-516001, A.P. I Have changed my Surname as **POLU VENKATA SUNITHA,** Here after my New Surname known as **POLU VENKATA SUNITHA** W/o POLU VENKATA SUBBA REDDY for all purposes.

## జాతీయ స్థాయి టైక్వాండో పోటీలలో బంగారు పతకాలు



**సిద్ధవటం మార్చి 4 ప్రభాతవార్త:**
గుంటూరులోని గాంధీ పార్క్ సమీపంలో ఉన్న టీటీడీ కల్యాణ మండపంలో 01.03.2026 తేదీన నిర్వహించిన జాతీయ స్థాయి ఓపెన్ టైక్వాండో పోటీలలో సిద్ధవటం మండలానికి చెందిన శ్రీ భారతి హై స్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించి పాఠశాలకే కాకుండా కడప జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. ఈ పోటీలలో క్రీడాకారులు భవనాశి సుశాంత్, కొల్లి ఈశ్వరనాథరెడ్డి తమ ప్రతిభతో ప్రత్యర్థులను ఓడించి బంగారు పతకాలు సాధించడం ద్వారా జాతీయ స్థాయిలో సత్తా చాటారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ముక్కర నిర్మలాదేవి మాట్లాడుతూ, విద్యార్థులు జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించడం ఎంతో గర్వకారణమని తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులు క్రీడల్లో మరిన్ని విజయాలు సాధించి పాఠశాల పేరు ప్రతిష్టలను మరింత పెంచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టైక్వాండో కోచ్ తిరుపతి ఆంజనేయులు, పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతర మహోత్సవంకు మంత్రికి ఆహ్వానం



**చిన్నమండెం మార్చి 03 ప్రబాతవార్త:**
నియోజకవర్గం చిన్నమండెం మండలం,కొత్తపల్లి గ్రామంలో బుధవారం నుండి జరుగుతున్న మల్లూరమ్మ తిరుణాల మహోత్సవానికి మంత్రి రాంప్రసాద్ రెడ్డి కుటుంబ సభ్యుల హాజరు కావాలని మండల టిడిపి నాయకులు మరియు ఆలయ ధర్మకర్తలు ఆయనకు ఆహ్వాన పత్రికను అందజేశారు. అన్నమయ్య జిల్లాలోని అమ్మవారి జాతరలలో మల్లూరమ్మ తల్లి జాతరకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. ఈ జాతరకు వచ్చేటువంటి భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని రకాల వసతి ఏర్పాట్లు చేయాలని కమిటీ నిర్వాహకులకు మంత్రి రాంప్రసాద్ రెడ్డి సూచించారు. ట్రాఫిక్ ఇతర సమస్యలు తలెత్తకుండా పోలీసులు పట్టిష్ట భద్రత ఏర్పాటు చేయాలని ఆయన తెలిపారు.

## నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలు : ఎమ్మెల్యే



సైన్స్‌మేళాను తిలకిస్తున్న ఎమ్మెల్యే

**మదనపల్లె, మార్చి 3 ప్రభాతవార్త :**
జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని విజయభారతి ఇంగ్లీష్‌మీడియం హైస్కూల్‌లో సైన్స్ దినోత్సవాన్ని ఘనంగాన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలు అన్నారు. ప్రతి విద్యార్థి సైన్స్‌లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన ప్రయోగశాలలను ఎమ్మెల్యే ఆసక్తికరంగా తిలకించారు. సివిరామన్ కొనుగొన్న సూత్రాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో విజయభారతిస్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.సేతు, బిజెపి జాతీయ నాయకులు చల్లపల్లె నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మెరుగైన ఆర్థోపెడిక్ శస్త్రచికిత్సలు..

**కడప కార్పొరేషన్ మార్చి 3 ప్రభాతవార్త:**



భుజము, తొంటి, మోకాలు సంబంధించిన సమస్యలతో బాధపడే వారికి మెరుగైన చికిత్స అందిస్తున్నట్లు కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మేడగం శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ప్రతి నెల ఒకటోవ మంగళవారం కడప యశోద మెడికల్ సెంటర్, ప్రొద్దుటూరు లతా నర్సింగ్ హోమ్. అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తామన్నారు. మంగళవారం యశోద మెడికల్ సెంటర్ లో ఏర్పాటు చేసిన మీడి యా సమావేశంలో డా. మేడగం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రధానంగా భుజం, మోకాలు, తొంటికి సంబంధించిన అత్యాధునిక ఆర్థోపెడిక్ శస్త్రచికిత్సలు సౌత్ కొరియా ఇటలీ, దుబాయిలో శిక్షణ పొందినటిట్లు తెలిపారు. కార్పొరేట్ ఆసుపత్రి అనగానే సామాన్యులు వైద్య ఖర్చుకు భయపడే పరిస్థితి ఉన్నది..కానీ ఆ భయాన్ని పోగొట్టేలా అడుగులు వేస్తూ వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఇతర ఆసుపత్రుల కంటే అతి తక్కువ ఖర్చుతోనే అత్యాధునిక వైద్య సేవలు అందించడమే మా ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. పలువురికి యశోద హాస్పిటల్ లో విజయవంతంగా శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు వివరించారు. యశోద హాస్పిటల్ మార్కెటింగ్ సీనియర్ మేనేజర్ సి.శ్రీనివాస్ రెడ్డి మరియు అసిస్టెంట్ మేనేజర్. పెంచల ప్రసాద్, సెంటర్ ఇంచార్జ్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## సౌమ్యనాథ స్వామి ఆలయం మూసివేత



**నందలూరు, మార్చి 03, ప్రభాతవార్త:**
జిల్లాలో ప్రసిద్ధి చెందిన శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయాన్ని చంద్రగ్రహణం సందర్భంగా మంగళవారం ఉదయం 9 గంటలకు మూసివేశారు. తిరిగి బుధవారం తెల్లవారుజామున ఆలయాన్ని శుద్ధి పరిచి 8:15 గంటలకు స్వామి వారికి నైవేద్యం సమర్పించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నట్లు ఆలయ ఇన్స్పెక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సునీల్ కుమార్, సంతోష్ శర్మ, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# కువైట్ లో గజగజ...ఇక్కడ దడ దడ...యుద్ధం భయం

**రాజంపేట, మార్చి 3 ప్రభాతవార్త:**
పొట్ట కూటి కోసం కువైట్ కి వెళ్ళిన కడప వాసులు గజగజ వణికి పోతున్నారు. యుద్ధం భయంతో, యుద్ధం వార్తలతో ఇక్కడ గడగడలాడిపోతున్నారు. కువైట్లో ఉంటున్న తమ వారికి ఏమి జరుగుతుందోనన్న ఆందోళన రోజు రోజుకు పెరుగుతోంది. యుద్ధం ప్రారంభమై మూడు రోజులైనా మంగళవారం ఇరాన్ కువైట్లోని అమెరికా సైనిక స్థావరంపై బాంబుల వర్షం కురిపించడంతో ఆరు మంది అమెరికన్ సైనికులు మరణించారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల ద్వారా తెలియడంతో ఇంకా భయం ఎక్కువైంది. ఫలితంగా కువైట్‌లోని అమెరికన్ ఎంబసీ కార్యాలయం కూడా మూసివేస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. ప్రతిరోజు బాంబుల శబ్దం వినిపిస్తూనే ఉన్నట్లు కువైట్ లో ఉంటున్న వారు ఇక్కడికి సమాచారం తెలియజేస్తున్నారు. అయితే కువైట్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు అక్కడివారికి పక్కా సమాచారాన్ని అందిస్తోంది. దీనికి తోడు మంగళవారం కువైట్ రాజుతో ప్రధాని మోడీ కూడా మాట్లాడారు. కువైట్లో ఉంటున్న భారతీయులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా చూడాలని కోరారు. ఈ వార్త కొంతవరకు కువైట్ లో ఉంటున్న వారి బంధుమిత్రులకు ఊరటనిచ్చింది. ఇప్పటివరకు జనావాసాలపై ఎలాంటి దాడులు జరగక పోయినా బిక్కు బిక్కు మంటూనే గడుపుతున్నారు. కడప జిల్లా నుంచి కువైట్ కు వేలాది మంది వెళ్లి ఉపాధి ఉపాధి కోసం జీవనం సాగిస్తున్నారు. ప్రతి రోజు కువైట్‌కు ఇకనుంచి వెళ్తూనే ఉంటారు. యుద్ధం తర్వాత విమానాల రాకపోకలు బంద్ చేయడంతో అక్కడి నుంచి రావాలనుకునే వారికి ఆందోళన పట్టుకుంది. రంజాన్ పండుగకు రావాలని అన్ని సిద్ధం చేసుకున్న వారికి యుద్ధభయం పట్టుకుంది. కువైట్ ప్రభుత్వం ఎలాంటి ఆందోళన అవసరం లేదని చెప్పున్నటికీ యుద్ధ భయం మాత్రం లేకపోలేదు. ఎందుకంటే పెద్ద సేట్లు ,ఆర్థికంగా స్థితి మంతులైన వారు ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోయారనికువైట్ లో ఉంటున్న జిల్లా వాసులు ఇక్కడికి సమాచారం అందిస్తున్నారు. ఇంట్లో యజమానులు లేకుండా కేవలం పనిచేసే వారే చాలా చోట్ల ఉన్నారని తెలుస్తోంది. ఇది కూడా ఒక ఆందోళన విషయమేనని వారు వ్యాఖ్యానిస్తున్నారు. కువైట్ లోని అమెరికా సైనిక స్థావరంపై దాడుల తర్వాత కువైట్ భారత్ మధ్య జరిగిన చర్చల్లో సురక్షితంగా ఇంటికి వెళ్లేందుకు ఏర్పాటు చేస్తే చాలా మంది ఇంటికి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ప్రధానంగా గల్ఫ్ దేశాలపైనే ఇరాన్ దాడులు చేస్తున్నట్లు వస్తున్న వార్తలతో కువైట్లో ఉంటున్న వారు భయాందోళనలో గురవుతున్నారు. కువైట్ పై సద్దాం హుస్సేన్ లో జరిగిన యుద్ధ తర్వాత నేడు అదే పరిస్థితి నెలకొంది. పవిత్ర రంజాన్ ఉపవాసాల నేపథ్యంలో కువైట్ జాతీయులకు కూడా యుద్ధం భయంతో ప్రశాంతత లేకుండా పోతుందనీ వ్యాఖ్యలు వినిపిస్తున్నాయని అక్కడి నుంచి కుటుంబ సభ్యులకు తెలియజేస్తున్నారు. కాదంటే జనావాసాలపై ఇప్పటివరకు దాడులు జరకపోవడం కొంచెం ఉపశమనంగా చెప్పవచ్చు.



కువైట్ లోని అమెరికా సైనిక స్థావరంపై ఇరాన్ దాడితో ఎగసిపడుతున్న మంటలు

## విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు



**కడప క్రైం, మార్చి 3, ప్రభాతవార్త:**
కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు జిల్లాలోని విద్యార్థులు మంచి పౌరులుగా ఎదిగేలా పోలీసు అధికారులు అవగాహన కార్యక్రమాలు ననిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం కడప సికె.దిన్నె పరిధిలోని శ్రీచైతన్య హైస్కూల్లో సి.కె.దిన్నె ఎస్సై శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో అత్యున్నత స్థాయికి ఎదిగేలా భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. బాగా చదువుకొని సమాజానికి, దేశానికి సేవ చేయాలని సూచించారు. దేశభవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పోక్సో యాక్ట్, పిల్లల భద్రత, బాల్య వివాహాలు, ఈవ్‌టీజింగ్, డయల్ 112, రహదారి భద్రత, గుడ్, బ్యాడ్ టచ్, సోషల్ మీడియా మరియు సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సి న జాగ్రత్తలను సి.కె.దిన్నె మహిళా పోలీస్, సిబ్బంది తెలిపారు.

## కళాభిరామ అవార్డును అందుకున్న వైభవ్ ప్రసాద్



**బద్వేలు అర్బన్, మార్చి 3, ప్రభాతవార్త**
హైదరాబాద్ రవీంద్ర భారతిలో లలిత కళాభిరామ బిజ్జం వారి 21 వ వార్షికోత్సవ పురస్కార వేడుకలు ఘనంగా నిర్వహించారు. మార్చి 1వ తేదీన జరిగిన ఈ కార్యక్రమంలో బద్వేలు వైభవ్ ప్రసాద్ మ్యాజిక్ షో పలువురిని కాకట్టుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ ఉన్నత విద్యా మండలి ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం, గొల్లపల్లి జయన్న హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం హర్షద్వానాలతో వైభవ్ ప్రసాద్ ను అభినందించారు. కార్యక్రమం అనంతరం లలిత కళాభిరామ బిజ్జం అనే వార్షిక పురస్కారం, మెమెంటోను అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఇప్పటికే జాదూరత్న ,జాదూగర్ అవార్డులతో పాటు పలు అవార్డులు అందుకున్న ప్రసాదు మరో మెట్టు ఎక్కినట్లు అయింది. ఈ పురస్కారం పొందిన వైభవ ప్రసాదం పట్టణంలో లోని పలువురు ఆర్యవైశ్యులు ప్రత్యేకంగా అభినందించారు.

## స్వచ్ఛంద సేవాసంస్థలో హోళి పండగ

**మదనపల్లె, మార్చి 3 ప్రభాతవార్త:**



పట్టణ సమీపంలోని దేవతానగర్ లో ఉన్న చైతన్య స్వచ్ఛంద సేవాసంస్థలో మంగళవారం హోలి పండగ ఘనంగా నిర్వహించారు. బోర్డు ఆప్ డైరెక్టర్స్ పట్నం గిరిజంమాల్, డైరెక్టర్ సుబ్రమణ్యం, సెక్రటరీ కవి తారాణిల ఆధ్వర్యంలో హోళి పండగను నిర్వహించారు. ఈసందర్భంగా జనరల్ సెక్రటరీ కవితా మాట్లాడుతూ చెడుపై మంచిని సాధించడమే హోలి పండగ నిర్వచనం అన్నారు. వసంత రుతువుల్లో పౌర్ణమిరోజున వస్తుంది అతి భయంకరమైన రాక్షసి హోళికాదేవిని వధించిన రోజు ప్రజలు ఆనందంగా జరుపుకొంటారన్నారు. ఈ సందర్భంగా పిల్లలందరూ రంగులను మొకాలకు పూసుకొని ఆనందంగా కేరింతలు చేశారు.

## శ్రీ కొండా సింగరాయుడు స్వామి ఉత్సవాలు





**బ్రహ్మంగారిమఠం మార్చి 03 ప్రభాతవార్త:**
మండల కేంద్రంలోని మిట్టమానుపల్లె వెళ్లే దారిలో శ్రీ ఈశ్వరమ్మ గృహ దగ్గరలో ఉన్న శ్రీ కొండ సింగరాయుడు స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించినట్లు దేవదాయ శాఖ ఆలయ ఈవో తెలిపారు. శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ కొండ సింగ రాయుడు స్వామి ఉత్సవాలు మంగళవారం ఉదయం సుప్రభాత సేవ ,గ్రామస్తులు భజన కార్యక్రమం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ,మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు స్థానిక ప్రజలు నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించి కాయ కర్పూరం అందజేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించి స్వామి కృపకు పాత్రులయ్యారు.

## 6న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సరస్వతీపూజ

**గాలివీడు, మార్చి 3(ప్రభాతవార్త):**
ఈ నెల 6వ తేదీన మండల కేంద్రం పెద్దూరులో వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు సరస్వతీపూజ నిర్వహిస్తున్నట్లు దేవాదాయ శాఖ ఈఓ కొండారెడ్డి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లోని హిందూ ఆలయాల్లో జిల్లా దేవాదాయ దర్మాదాయ శాఖ జిల్లా అధికారి విశ్వనాధ ఆధ్వర్యంలో సరస్వతీపూజలు నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా 10వ తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు ముందస్తుగా అన్ని ఆలయాల్లో సరస్వతీపూజ నిర్వహించడంతో పదవ తరగతి ఉత్తీర్ణత శాతం పెంచేందుకు దోహదపడతాయన్నారు. ఈ పూజా కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని ఆశాభావం వ్యక్తం చేశారు.

## కనులు పండువగా చంద్రశేఖరస్వామి రథోత్సవం



**రామసముద్రం మార్చి 3 ప్రభాతవార్త**
మండల కేంద్రంలో దిగువ పేటలో కొలువైన శ్రీ ప్రసన్న పార్వతీ సమేత చంద్రశేఖర స్వామి వారి బ్రహ్మోత్సలు భాగంగా రథోత్సవం మంగళవారం భక్తి శ్రద్దలతో నిర్వహించారు. స్వామి వారికి ఉదయం పంచామృతాభిషేకం, ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. రథం పై కళశం పెట్టి ప్రత్యేక పూజలు చేసి అనంతరం రథాన్ని సుగంధ పుష్పాలంతో అలంకరణ చేసి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ అనంతరం రథం పై కొలువు దీర్చి అనంతరం ఆలయప్రధాన అర్చకులు బాలా స్వామి, అర్చకులబృందం వారిచే మంగళ హారతి పట్టి రథోత్సవాన్ని లాంచనంగా ప్రారంభించారు. మండల వ్యాప్తంగా భక్తులు తరలి వచ్చారు. రథంపై పూలు, అరటి పళ్ళు, దవనం వేసి మొక్కులు చెల్లించుకున్నారు. రథోత్సవానికి కళా బృందా లు చెక్క భజన లు, కో ళాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి, భక్తులు స్వామి వారి రథాన్ని భక్తి శ్రద్దలతో ఓం నమః శివాయ అంటూ రథాన్ని లాగారు, అనంతరం డప్పు వాయిద్యాలు నడుమ స్వామి వారిని పురవీధుల్లో ఊరేగించగా, భక్తులు కర్పూర హారతులు పట్టి స్వామి వారిని దర్శనం చేసుకుని స్వామి వారికి పుష్పాలు సమర్పించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు స్వామి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## ఘనంగా గౌర పౌర్ణమి

**ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 3, ప్రభాత వార్త :**
స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో మంగళవారం రాత్రి అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘం(ఇస్కాన్) ఆధ్వర్యంలో ఘనంగా గౌర పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. రాత్రి 7 గంటలకు శ్రీకృష్ణ. బలరామ విగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా రంగురంగుల పూలతో మహా అభిషేకం నిర్వహించారు. భజన, హరినామ సంకీర్తనలు చేశారు. దేవతా మూర్తులను దర్శించుకున్న భక్తులకు వెన్నలడ్డూలను ప్రసాదంగా పంపిణీ చేశారు. అలాగే చంద్ర గ్రహణానంతరం రాత్రి 6.50 గంటలకు సంపూర్ణ అన్నప్రసాద వితరణ ప్రారంభించారు. ఇస్కాన్ ప్రతినిధులు భగవద్గీత గొప్పతనాన్ని వివరించి, దీనిని చదవడం వల్ల మంచి చెడుల విచక్షణ జ్ఞానం తెలుస్తుందన్నారు. ఈ సందర్భంగా 30వేల మందికిపైగా భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. చిన్నారులు ప్రదర్శించిన నాటకం అందరిని ఆకట్టుకుంది. పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



## ఘనంగా బంజారా హోలీ ఉత్సవాలు




**కడప కార్పొరేషన్ మార్చి 3 ప్రభాతవార్త:**
కడప జిల్లా బంజారా హోలీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కడప నగరంలో గిరిజన భవన్‌లో కడప జిల్లాలో వుండే బంజారా ఉద్యోగులు, వ్యాపారస్తులు, ముఖ్యంగా బంజారా యువతి యువకులు బంజారా సంస్కృతి సాంప్రదాయ పద్దతిలో హోలీ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. పూజలు చేసి, రంగులు చల్లుకొని, విందు భోజనాలతో సంతోషంగా గడిపారు. ఈ కార్యక్రమంలో దాదాపు వెయ్యి మంది బంజారా కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. అదేవిదంగా వివిధ హోదా లో వచ్చిన ముఖ్య నాయకులకు సన్మానం చేసారు. హోలీ నిర్వహణ కమిటీ సభ్యులు డాక్టర్. శివా నాయక్ మాట్లాడుతూ దేశంలోనే పెద్ద పండుగ హోలీ. అటువంటి హోలీ పండుగను గత 13 సంవత్సరాలనుండి జరుపుకుంటున్నాము. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా రాష్ట్ర అధ్యక్షులు ఎస్. వెంకట రమణ నాయక్, కడప డిప్యూటీ మేయర్ నిత్యనంద రెడ్డి ,హోలీ నిర్వాహకులు వెంకట స్వామి నాయక్, మూడే శంకర్ నాయక్, శ్రీనివాస్ నాయక్, వేణుగోపాల్ నాయక్, రామూర్తి నాయక్, అర్జున్ నాయక్, కృష్ణ నాయక్, రామ్లా నాయక్, మహిళలు సావిత్రి భాయ్, సోని భాయ్, సరోజ భాయ్ పాల్గొన్నారు.

## పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్,



**మైదుకూరు, మార్చి 03, ప్రభాతవార్త:**
కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు మైదుకూరు డిఎస్పి రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో పట్టణ సిఐ రమణా రెడ్డి, రూరల్ సీఐ శివ శంకర్, ఖాజీపేట సీఐ వంశీధర్,ఎస్ఐ లు రమణ, బి.మఠం ఎస్ ఐ శివ ప్రసాద్, దువ్వూరు ఎస్ఐ ధనుంజయుడు, చాపాడు ఎస్సై చిన్న పెద్దయ్య మరియు సిబ్బంది, హోంగార్డ్స్ తో కలిసి మైదుకూరు పట్టణం పరిధిలోని ఇందిరమ్మ కాలని, వెంకట సుబ్బయ్య కాలిని, సుందరయ్య నగర్ లలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. పాత నేరస్తులు, సస్పెక్ట్ షీటర్, గంజాయి నేరస్తుల ఇళ్లల్లో తనిఖీలతో పాటు,పాత నేరస్తులకు కౌన్సిలింగ్,వాహన పత్రాలు సరిగా లేని 21 బైక్ లను మరియు 6 ఆటో లనుస్వాధీనం చేసుకోవడం జరిగింది. అనంతరం ఇందిరమ్మ కాలిని ప్రజలతో పోలీసులు మాట్లాడుతూ నేరాల నివారణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని,చట్టవ్యతిరేక , అసాంఘిక కార్యక్రమాల గురించి ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని అవగాహన కల్పించారు. అంతేకాకుండా ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానస్పదంగా కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసుల వారికి సమాచారం అందించాలన్నారు.

### ఇన్స్పైర్ మానక్ అవార్డుకు ఎంపికైన ఏవీఆర్ టెక్నో స్కూల్ విద్యార్థిని

**బద్వేల్ అర్బన్ ,మార్చి 3, ప్రభాతవార్త**



ఏవీఆర్ టెక్నో పాఠశాలకు చెందిన విద్యార్థిని పల్లవి ప్రతిష్టాత్మకమైన ఇన్స్పైర్ మానక్ అవార్డుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సురేష్ బాబు తెలిపారు. ఇన్స్పైర్ మానక్ అవార్డు అనేది భారత ప్రభుత్వం, ఆధ్వర్యంలో నిర్వహించబడే జాతీయ స్థాయి కార్యక్రమం. ఈ పథకం దేశవ్యాప్తంగా పాఠశాల విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు మరియు సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు రూపొందించబడింది. ఈ ఎంపికలో భాగంగా పల్లవికి తన సైన్స్ ప్రాజెక్ట్/మోడల్ అభివృద్ధి కోసం రూ. 10,000 ఆర్థిక సహాయం అందజేయబడుతుందన్నారు. ఈ అవార్డు విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలను పెంపొందించడమే కాకుండా, శాస్త్ర విజ్ఞానంపై ఆసక్తిని మరింతగా పెంచుతుంది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ విద్యార్థిని సాధించిన విజయంపై ఆనందం మరియు గర్వాన్ని వ్యక్తం చేశారు. ఈ విజయం పాఠశాల విద్యార్థుల్లో సృజనాత్మకత, పరిశోధనా దృక్పథం మరియు విద్యలో ఉన్నతతను పెంపొందించేందుకు చేస్తున్న కృషికి నిదర్శనమని తెలిపారు. పల్లవిని అభినందించి ఆమెకు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరులు , సీఈఓ వివేకానంద , డీజీఎం సుబ్రహ్మణ్యం రెడ్డి , అకాడమిక్ డైరెక్టర్ శ్రీ చంద్ర మోహన్ , ఉపాధ్యాయులు తెలిపారు.

## అక్రమ రేషన్ బియ్యం నిలువుల తనిఖీ

**కడప మార్చి 3, ప్రభాతవార్త**
03.03.2026 వ తేదీన తెల్లవారుజామున మైదుకూరు పట్టణములోని నంద్యాల రోడ్డు నందుగల Water Plantలోని ఖాళీ స్థలంలో PDS రేషన్ బియ్యం నిలవ ఉంచి అక్రమముగా రవాణా చేయుటకు సిద్ధంగా ఉన్నారనే సమాచారము మేరకు కడప విజిలెన్స్ అధికారులు మరియు బద్వేల్ CSDT ఎస్. శివశంకర్ అధ్వర్యంలో తనిఖీ చేయడమైనది. ఈ తనిఖీలలో మైదుకూరు పట్టణానికి చెందిన శీలం సురేంద్ర అనే వ్యక్తి మైదుకూరు, బి.మఠం చుట్టు ప్రక్కల గ్రామాల నుండి PDS బియ్యం, జొన్నలు మరియు రాగులు తక్కువ ధరకు సేకరించి నిల్వ ఉంచి పసల పవన్ కళ్యాణ్, ఎం.వంశీ అనే వ్యక్తుల ద్వారా బొలెరో వాహనము ద్వారా శ్రీ సుబ్బరాయ రైస్ మిల్ ఓనర్ అయిన శ్రీ ప్రసాద్ అనే వ్యక్తికి అధిక ధరలకు విక్రయించడాన్ని తనిఖీ అధికారులు గుర్తించినారు. తర్వాత రేషన్ బియ్యాన్ని లెక్కించగా 1425 కిలోలు 57 బస్తాలుగా ఉండి వాటి విలువ సుమారుగా రూ. 35,625/ , జొన్నలు లెక్కించగా 4550 కిలోలు 91 బస్తాలుగా ఉండి వాటి విలువ సుమారుగా రూ. 1,72,900/ మరియు రాగులు 270 కిలోలు 6 బస్తాలుగా ఉండి వాటి విలువ సుమారుగా రూ. 12,420/ గా ఉండి వీటి మొత్తం విలువ సుమారుగా రూ. 2,20,945/ గా ఉండినది. తదుపరి పట్టుబడిన రేషన్ బియ్యం, జొన్నలు మరియు రాగులను, బొలెరో మరియు Ape Auto వాహనములతో పాటు సీజ్ చేసి బద్వేల్ CSDTకి అప్పగించడమైనది. మరియు పై నలుగురు వ్యక్తులు అయిన శీలం సురేంద్ర, పసల పవన్ కళ్యాణ్, ఎం.వంశి మరియు ప్రసాద్ లపై 6(A) కేసు నమోదు చేసి SHO ,మైదుకూరు వారికి అప్పగించడమైనది. ఈ తనిఖీలలో విజిలెన్స్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీసు, శ్రీ శివన్న, విజిలెన్స్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీసు, శ్రీ.శ్రీనివాస రెడ్డి, విజిలెన్స్ అగ్రికల్చరల్ ఆఫీసరు బి.లక్ష్మణ కుమార్, బద్వేల్ CSDT శివ శంకర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.







తెలుగు దిన పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న వార్త దిన పత్రిక నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

అన్నమయ్య జిల్లా

పుంగనూరు, సదుం, సోముల

పుంగనూరు రూరల్, వాయల్పాడు, కలకడ

ఇంటర్వ్యూ తేది : 08.03.2026

మీ పూర్తి బయోడేటాతో ఈ క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

వార్త కార్యాలయం, డోర్ నెం. 1-2237, హౌసింగ్ బోర్డు కాలని, విశ్వేశ్వరయ్య సర్కిల్ దగ్గర, రైల్వేస్టేషన్ రోడ్డు, కడప.

సెల్ నెం. 9848787289, 8919566086